సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం, 27, జనవరి, 2024



ఘనంగా క్షీరాభిషేక సేవ


విశాఖ నగరంలోని బురుజుపేటలో వెలసిన శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. 8లో



ఉత్తమ సేవలకు పురస్కారం

జిల్లాలో ఉత్తమ సేవలందించిన 331 మంది అధికారులు, ఉద్యోగులకు కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రశంసా పత్రాలు అందజేశారు. 8లో

వెంకన్నకు పంచామృతాభిషేకం



పెందుర్తి వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం పంచామృత అభిషేకం నిర్వహించారు.



సంగివలసలో సభా వేదిక

ఎన్నికల సమరానికి సిద్ధం



ఏర్పాట్లపై పోలీసు అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ తలశిల రఘురాం

- భీమిలి నుంచి సీఎం జగన్ ఎన్నికల శంఖారావం
- సంగివలసలో 15 ఎకరాల విస్తీర్ణంలో భారీ బహిరంగ సభ
- 34 నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలతో సీఎం జగన్ మాటామంతీ
- ఉమ్మడి జిల్లాల నుంచి లక్షల్లో తరలిరానున్న ప్రజలు
- మధ్యాహ్నం 3 గంటలకు విశాఖ చేరుకోనున్న సీఎం
- గంటన్నరపాటు నేతలతో ముఖాముఖి, ప్రజలను ఉద్దేశించి ప్రసంగం
- సాయంత్రం 5.30కు తిరుగు పయనం



ముస్తాబైన వేదిక

సాక్షి, విశాఖపట్నం/తగరపువలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు సర్వం సన్నద్ధమైంది. భీమిలి నుంచి సీఎం ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్నారు. ఉత్తరాంధ్ర నుంచే ఎన్నికల సమరానికి శ్రేణులను సమాయత్తం చేయనున్నారు. 'సిద్ధం' పేరుతో భీమిలి నియోజకవర్గం సంగవలస గ్రామంలో 15 ఎకరాల విస్తీర్ణంలో భారీ బహిరంగ సభకు వైఎస్సార్‌సీపీ నేతలు భారీ ఏర్పాట్లు చేశారు. 34 అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి నాయకులు, కార్యకర్తలతో పాటు లక్షలాది మంది ప్రజలు సభకు తరలిరానున్నారు.

శనివారం సాయంత్రం 3.30 నుంచి 5 గంటల వరకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సభ జరగనుంది. ఉత్తరాంధ్రలో 34 అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి నియోజకవర్గాల వారీగా నాయకులు, కార్యకర్తలు, గృహసారథులతో సీఎం జగన్ ముఖాముఖి ముచ్చటించనున్నారు. నియోజకవర్గాల్లో పరిస్థితులను స్వయంగా తెలుసుకోనున్నారు. అలాగే కొన్నిచోట్ల ఇన్‌చార్జ్‌లను ఎందుకు మార్చాల్సి వచ్చిందో సీఎం తెలియజేయనున్నారు. ప్రభుత్వ హయాంలో చేసిన సంక్షేమం, చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించనున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన వైవీ సుబ్బారెడ్డి, తలశిల

మూడు రోజులుగా జరుగుతున్న సిద్ధం బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సభా ఏర్పాట్లను సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, శ్రీకాకుళం జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాసు పరిశీలించారు.

వేదిక ఇలా..

- ఉత్తరాంధ్రలో 34 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి లక్షల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సభకు తరలిరానున్నారు. దీంతో అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నారు.
- అన్ని వైపుల నుంచి ప్రతి ఒక్కరికీ కనిపించేలా సభా వేదికను 80x48 అడుగుల విస్తీర్ణంలో సభా వేదిక సిద్ధం చేశారు.
- ఈ వేదికపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఉత్తరాంధ్రకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సమన్వయకర్తలు, పార్టీ అధ్యక్షులు ఆశీనులవుతారు.
- వేదిక ముందు నియోజకవర్గాల వారీగా 35 బ్లాకులు ఏర్పాటు చేశారు.
- వేదిక నుంచి బ్లాకుల వరకు టీ ఆకారంలో ర్యాంపు సిద్ధం చేశారు. దీనిని జాతీయ రహదారి వైపు 350 అడుగులు, కుడి, ఎడమల వైపు చెరో 75 అడుగుల మేర నిర్మిస్తున్నారు.
- వేదిక చుట్టూ 'సిద్ధం' పేరుతో ఫ్లెక్సీలు కట్టి బెలూన్లు ఏర్పాటు చేస్తున్నారు. భీమిలి మొత్తం వైఎస్సార్‌సీపీ జెండాలు, ఫ్లెక్సీలతో కళకళలాడుతోంది.
- సీఎం జగన్ ఈ ర్యాంపు మీదుగా నడిచి ఆయా నియోజకవర్గాల నాయకులతో మాట్లాడుతారు.
- సభ జరుగుతున్న చుట్టుపక్కల ప్రదేశాలు బంగ్లామెట్ట, సంగివలస, ఆదర్శనగర్, చెరకుపల్లి ఇలా పలు ప్రాంతాల్లో 30 ఎకరాలలో పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు.
- సభను ఆనుకొని అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాల అవుట్‌గేట్‌కు ఎదురుగా 6 ఎకరాల విస్తీర్ణంలో హెలిప్యాడ్ నిర్మించారు.
- శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి కాన్వాయ్‌కు సంబంధించి ట్రయల్ రన్ కూడా నిర్వహించారు.

ముఖ్యమంత్రి పర్యటన ఇలా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం మధ్యాహ్నం 2.05 గంటలకు గన్నవరంలో బయలుదేరి 3 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో సంగివలస గ్రామంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన సభాస్థలికి చేరుకుంటారు. 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం సభాస్థలి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 5.25 గంటలు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 5.35 గంటలకు విమానంలో బయలుదేరి గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.

భారీ భద్రతా చర్యలు : సీఎం జగన్ సభకు పోలీసులు భారీ భద్రతా చర్యలు చేపడుతున్నారు. సభ వేదిక వద్ద బందోబస్తుతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, రక్షణ చర్యలకు సుమారు 3 వేల మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని వినియోగిస్తున్నారు. ఇప్పటికే సభా స్థలిలోనే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల్లో బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో క్షుణ్ణంగా తనిఖీ చేపట్టారు. సభ వేదికకు సమీపంలో ఉన్న బిల్డింగ్‌లు, అపార్ట్‌మెంట్లపై ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నారు. అక్కడి నుంచి నిరంతర నిఘా పెడుతున్నారు. విశాఖ ఎయిర్‌పోర్టులో కూడా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. వెస్ట్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహ మూర్తి శుక్రవారం విమానాశ్రయంలో సిబ్బంది పలు సూచనలు చేశారు.



హోర్డింగ్‌లతో స్వాగతం

సభా ప్రాంగణం కళకళ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభతో ఆ ప్రాంతం రూపురేఖలు మారిపోయాయి. సభా వేదిక పరిసర ప్రాంతాల్లో అదనపు సౌకర్యాలు కల్పిస్తున్నారు. ప్రభుత్వ స్థలాల్లోనే కాకుండా ప్రైవేటు ప్రాంతాల్లో కూడా ఉన్న తుప్పలు, డెబ్రిస్ తొలగించారు. గ్రావెల్‌తో ఆ ప్రాంతాన్ని చదును చేశారు. కొత్తగా వీధిదీపాలు ఏర్పాటు చేశారు. డివైడర్లు, అండర్‌పాస్ రహదారులకు ఇరువైపులా రంగులు వేశారు. హెలిప్యాడ్ నుంచి సభ జరిగే వేదిక చుట్టూ డ్రైనేజీలు, రహదారులు నిర్మించారు.

సంక్షేమమే లక్ష్యంగా పాలన

- అర్హతే ప్రామాణికంగా లబ్ధి
- కలెక్టర్ సుమిత్‌కుమార్
- ఘనంగా గణతంత్ర వేడుకలు
- తలారిసింగి మైదానంలో ప్రత్యేక ఆకర్షణగా శకటాలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



ప్రథమ బహుమతి సాధించిన వ్యవసాయశాఖ శకటం



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్ సిన్హా



నృత్య రూపకం



గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

సాక్షి,పాడేరు: కుల,మత, రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన పాడేరులోని తలారిసింగి పాఠశాల క్రీడామైదానంలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయనతోపాటు ఎస్పీ తుహిన్ సిన్హా, జాయింట్ కలెక్టర్ కార్తీక్, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి పోలీసులు, విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా ప్రగతిపై తన సందేశాన్నిచ్చారు. జిల్లాలోని 22మండలాల్లో ప్రజల ఆర్థికాభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందన్నారు. అన్ని గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.

నవరత్నాలతో అందరికీ మేలు

నవరత్నాల పథకాలను అర్హులందరికీ అమలు చేయడం ద్వారా ఆర్థికంగా మేలు చేకూరుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు గుర్తించిన 2034 పనులకు పలు విడతల్లో రూ.68.30కోట్లతో పరిపాలనపరమైన అనుమతులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గిరిజన యువతకు ఉపాధి కల్పనకు స్కిల్‌హబ్, స్కిల్ కళాశాలల ద్వారా శిక్షణా కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు.జాబ్‌మేళాలతో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. నాడు-నేడు రెండవ విడతలో 947 పాఠశాలలు,127 అంగన్‌వాడీ కేంద్రాలు, 12 జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.

గిరి రైతుల సంక్షేమానికి..

రైతుభరోసా పథకంలో జిల్లాలో లక్షా 70వేల 835మందికి ఏటా రూ.153 కోట్ల ఆర్థిక సాయం అందిస్తున్నామని, రూ.2.87కోట్ల సబ్సిడీతో వ్యవసాయ యాంత్రీకరణకు చర్యలు తీసుకున్నామమని కలెక్టర్ వెల్లడించారు. ప్రతి నెలా జిల్లాలో 1,29,285 మంది పింఛనుదారులకు రూ.39కోట్ల వైఎస్సార్ పింఛన్ కానుకను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. వైఎస్సార్ ఆసరా పథకంలో 85వేల మందికి రూ.104కోట్లు జమచేశామన్నారు. సున్నా వడ్డీ పథకంలో 12,818 డ్వాక్రా సంఘాలకు రూ.19.26 కోట్లు, వైఎస్సార్ ఆసరాలో 8,664 డ్వాక్రా సంఘాలకు రూ.34 కోట్లు చెల్లించామన్నారు.

ఆదివాసీలకు పక్కా ఇళ్లు

పీఎం జన్‌మన్ పథకంలో జిల్లాలోని 24,154 ఆదివాసీ కుటుంబాలకు పక్కా గృహాలు మంజూరు చేశామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. జిల్లాలో రంపచోడవరం ప్రాంతం నుంచి ఎస్.కోట ప్రాంతంలోని బొడ్డవర వరకు 255 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి పనులు రూ.2,110 కోట్లతో జరుగుతున్నాయన్నారు. చింతూరు నుంచి ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో చేపట్టిన జాతీయ రహదారుల నిర్మాణాలు కూడా చురుగ్గా జరుగుతున్నాయన్నారు.

గంజాయి రహిత జిల్లాగా..

ఆపరేషన్ పరివర్తనలో భాగంగా గంజాయి సాగు రహిత జిల్లాగా చర్యలు చేపట్టామని కలెక్టర్ పేర్కొన్నారు. గతేడాది 346.21 ఎకరాల గంజాయి తోటలను ధ్వంసం మిగతా 8వ పేజీలో ▶

విశేషంగా సహస్రనామార్చన



సహస్రనామార్చన నిర్వహిస్తున్న పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం సహస్రనామార్చనని విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజింపచేశారు. 1001 నామాలతో స్వామికి అర్చన చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. పూజలో పాల్గొన్న భక్తులకు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు.

సచివాలయ వ్యవస్థతో మెరుగైన పాలన

రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి



బోలగొండలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం: గ్రామ సచివాలయ వ్యవస్థతో మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చాయని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని మడిచర్ల, బోలగొండ గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల భవనాలను ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా లక్ష్మితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏపీలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి విప్లవాత్మకమైన పాలనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు నేరుగా ఇంటి వద్దకే అందించేందుకు సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు పనిచేస్తున్నాయన్నారు. కొరుమిల్లి గ్రామంలో రూ.1.60 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. బోలగొండ,మడిచర్ల గ్రామంలో నూతన సచివాలయ భవనాన్ని ఆమె ప్రారంభించారు. పెద్దగెద్దాడ ఆశ్రమ పాఠశాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

నేడు గవరపాలెం గౌరీపరమేశ్వరుల జాతర

- అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు



విద్యుత్ లైటింగ్ సెట్‌లు



అనకాపల్లి: ఉత్తరాంధ్రలో ప్రఖ్యాతి గాంచిన గవరపాలెం గౌరీపరమేశ్వరుల జాతరకు సర్వం సిద్ధమైంది. ఇక్కడ శనివారం ప్రారంభమయ్యే ఈ ఉత్సవానికి సంబంధించి ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొణతాల సంతోష్ అప్పారావునాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 138 ఏళ్ల చరిత్ర కలిగిన అమ్మవారి మహోత్సవానికి మూడు లక్షల మంది భక్తులు విచ్చేస్తారని అంచనా.. తెల్లవారుజాము నుంచి ఆలయంలో గౌరీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉదయం 10 గంటలకు అమ్మవారి రథాన్ని పురవీధుల్లో ఆదివారం రాత్రి వరకూ ఊరేగిస్తారు. సోమవారం తెల్లవారు స్థానిక శారదానదిలో నిమజ్జనం చేస్తారు.

భారీ స్థాయిలో సాంస్కృతిక ప్రదర్శనలు...

అమ్మవారి ఆలయం నుంచి భారీ స్థాయిలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. 'తాంబూలం', 'బ్యాండ్ డ్రమ్స్', 'గరగలు', 'దాండియా', 'కేరళ వాయిద్యం', 'నవదుర్గలు', 'పులివేషాలు', నాలుగు ట్రాక్టర్లపై 'ఎలక్ట్రికల్ వేషాల బండ్లు' ప్రదర్శించనున్నారు.

గవరపాలెం సంతోషిమాత ఆర్చి వద్ద మందుగుండు సీతారామయ్య గారి కుటుంబం ఆధ్వర్యంలో రాత్రి 2 నుంచి 3 గంటల వరకూ 'బాణసంచా విన్యాసాలు' ప్రత్యేక ఆకర్షణ నిలవనున్నాయి. జాతరను పురస్కరించుకుని డీఎస్పీ వి.సుబ్బరాజు ఆధ్వర్యంలో 10 మంది సీఐలు, 25 మంది ఎస్ఐలు, 200 మంది కానిస్టేబుళ్లతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పదవీ కాలం పొడిగింపు

కొయ్యూరు: స్థానిక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సుమర్ల సూరిబాబు పదవీ కాలాన్ని ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. ఈ సందర్భంగా శుక్రవారం ఆయనకు చిరు వ్యాపారులు సత్కారం చేశారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు శనివారం భీమిలిలో జరిగే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

పరవాడ : స్థానిక పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కించారపు సన్యాసిదొర (36) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడని పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు. పాడేరు జిల్లా పెదబయలు మండలం మండిబ గ్రామానికి చెందిన కించారపు సన్యాసిదొర తన స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై పరవాడ పోలీసు స్టేషన్‌లో విధులకు హాజరు కావడానికి వస్తున్నారు. మార్గమధ్యలో గుండెలో నొప్పి వస్తున్నట్లు గ్రహించిన సన్యాసిదొర వడ్డాది మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స కోసం చేరారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ మరణించారని సీఐ చెప్పారు. సదరు విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. దివంగత సన్యాసిదొర కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

గూడెం కొత్తవీధి: విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని మొండిగడ్డ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. మొండిగడ్డ గ్రామానికి చెందిన భీమ్‌బాబు కుమారుడైన కొండేముల మహీంద్ర (22) ఇంట్లో వేడి నీళ్ల నిమిత్తం ఏర్పాటుచేసిన హీటర్‌ను పట్టుకున్నాడు. అప్పటికే విద్యుత్ సరఫరా ఉండటంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో మహీంద్ర తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

చదువుతోనే బంగారు భవిష్యత్తు

- ఏపీ ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు
- స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు

హుకుంపేట: చదువుతోనే బంగారు భవిష్యత్తు సాధ్యమని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గిరి జాగృతి అసోషియేషన్ ఆధ్వర్యంలో 35 మంది గిరిజన విద్యార్థులు, నిరుద్యోగ యువతీ యువకులకు గ్రూప్1,2, డీఎస్సీ, టెట్ స్టడీ మెటీరియల్‌ను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా బుల్లిబాబు మాట్లాడుతూ గిరి యువత స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్టడీ మెటీరియల్‌ను అందించిన గిరిజాగృతి అసోసియేషన్ సిబ్బందిని ఆయన అభినందించారు. ఎంపీపీ కూడా రాజుబాబు, ఎంపీడీవో వెంకటరావు, ఈవోపీఆర్డీ అశోక్, అసోసియేషన్ అధ్యక్షుడు మోరి సింహాచలం పాల్గొన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా పాలన


పాడేరు ఐటీడీఏ వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

▶7వ పేజీ తరువాయి

చేశామన్నారు. శాటిలైట్ సాయంతో 100 ఎకరాలు గుర్తించి ధ్వంసం చేశామన్నారు. గంజాయి సాగుకు ప్రత్యామ్నాయంగా 10,290 ఎకరాలలో రాజ్‌మాతో పాటు ఇతర వాణిజ్య పంటలను ప్రోత్సహించామని కలెక్టర్ వివరించారు. ఎన్ఆర్ఈజీఎస్‌లోను పలు రకాల పండ్లజాతుల సాగును ప్రోత్సహించామని, రూ.2.67కోట్లతో 12లక్షల మొక్కలను పంపిణీ చేసినట్టు వెల్లడించారు.

వరదల్లో బాసటగా..

వరదల సమయంలోను చింతూరు డివిజన్‌లోని ముంపు గ్రామాల్లో సహాయక కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టామని కలెక్టర్ సుమిత్‌కుమార్ వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించి బాధితులను పరామర్శించారని ఆయన తెలిపారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.6.80లక్షలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.3.20లక్షలు ఇచ్చే విధంగా ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. వరద ముంపు గ్రామాల్లో 27వేల కుటుంబాలకు నిత్యావసర సామగ్రిని పంపిణీ చేయడంతో పాటు నష్టంతో సంబంధం లేకుండా ప్రతి ఇంటికి రూ.2వేల చొప్పున రూ.5.40 కోట్ల నగదు పంపిణీ చేసినట్టు చెప్పారు.

1.42 లక్షల మందికి అటవీభూమి

అటవీ హక్కు చట్టంలో భాగంగా జిల్లాలో 1.42 లక్షల కుటుంబాలకు 2.80 లక్షల ఎకరాల అటవీ భూములను పంపిణీ చేసినట్టు కలెక్టర్ తెలిపారు. వీరికి రూ.80 కోట్లమేర రైతు భరోసా సాయాన్ని అందించామని చెప్పారు. జిల్లాలో 2088 సెల్‌టవర్ల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించగా ఇప్పటికే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 400 సెల్‌టవర్లను రెండు విడతల్లో వర్చువల్ విధానంలో ప్రారంభించినట్టు చెప్పారు. జిల్లాలో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, పాడేరు ఏఎస్పీ అడ్మిన్ అనిల్‌కుమార్, చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిషోర్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాడేరు : స్థానిక ఐటీడీఏ కార్యాలయం వద్ద పీవో అభిషేక్ జాతీయ జెండాను ఎగరవేసి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అల్లూరి, గాం మల్లుదొర, భగవన్ బిర్సాముండా క్యాంస్య విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కె.కోడాపల్లి ఆంజనేయ స్వయం సహాయక సంఘ మహిళలు కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఏపీవోలు ప్రభాకర్ రావు, వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, ఎస్‌డీసీ వీవీఎస్ శర్మ, ఐటీడీఏ ఏవో హేమలత, పీహెచ్‌వో అశోక్, ఏఏవో శ్రీనివాస కుమార్, డీఆర్డీఏ పీడీ వి. మురళి, సమాచార శాఖ ఏపీవో పి. రాములు పాల్గొన్నారు.


రంపచోడవరంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే


చింతూరు అటవీ రేంజర్ విజయలక్ష్మికి ప్రసంశాపత్రం అందజేస్తున్న పీవో చైతన్య, ఏఎస్పీ రాహుల్‌మీనా


కలెక్టర్ కార్యాలయంలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

రంపచోడవరం : స్థానిక ఐటీడీఏ కార్యాలయ ప్రాగణంలో శుక్రవారం రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే జాతీయ జెండాను ఎగురవేశారు. గిరిజన సంక్షేమశాఖ డీడీ అబ్బులాం, ఏవో డీఎన్‌వీ రమణ, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, ఈఈ జి. డేవిడ్ రాజ్, పీహెచ్‌వో చిట్టిబాబు, పీఏవో రాంబాబు, సీడీపీవో సంధ్యారాణి, డిప్యూటీ డీఈ చైతన్య, నాగరాజు పాల్గొన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఏఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ జగదీష్ అడహల్లి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

చింతూరు: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పీవో కావూరి చైతన్య జాతీయ జెండాను ఎగురవేసి గౌరవవందనం స్వీకరించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ఆయన ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రాహుల్‌మీనా, డీఎఫ్‌వో పుష్పసౌజన్య, ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల పాల్గొన్నారు.

సాక్షి,పాడేరు: కలెక్టరేట్‌లో జాతీయ జెండాను జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు. డీఆర్వో వి.వి.రమణ,ఎస్‌డీసీలు అంబేద్కర్,శర్మ,మురళీకృష్ణ,డీటీవో ప్రసాద బాబు,డీపీఆర్వో గోవిందరాజు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శకటాలు.. సాంస్కృతిక ప్రదర్శనలు


ద్వితీయస్థానం సాధించిన విద్యాశాఖ శకటం


తృతీయస్థానం సాధించిన వైద్య ఆరోగ్యశాఖ శకటం


ప్రథమస్థానంలో నిలిచిన పాడేరు బీవీకే పాఠశాల విద్యార్థినుల నృత్య ప్రదర్శన


డ్వాక్రా మహిళలకు చెక్కును పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ కార్తీక్, ఐటీడీఏ పీవో అభిషేక్ తదితరులు

సాక్షి, పాడేరు: గణతంత్ర వేడుకల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై స్థానిక తలారిసింగి మైదానంలో ఏర్పాటుచేసిన వివిధ శాఖల శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. వ్యవసాయశాఖకు చెందిన శకటం ప్రథమ, విద్యాశాఖ శకటం ద్వితీయ, వైద్య ఆరోగ్యశాఖ శకటం తృతీయ బహుమతి పొందాయి. జీసీసీ,వెలుగు,కాఫీ బోర్డు,వ్యవసాయ,ఐసీడీఎస్‌ల స్టాళ్లు ఆకట్టుకున్నాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తలారిసింగి మైదానంలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పాడేరు బీవీకే పాఠశాలకు చెందిన బాలికలు ప్రథమ, పాడేరు ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం విద్యార్థినులు ద్వితీయ, ,శ్రీకృషాపురం విద్యార్థినుల ప్రదర్శన తృతీయ స్థానం సాధించాయి. కొయ్యూరు పాఠశాలకు చెందిన విద్యార్థుల మల్లకంబ ప్రదర్శన అబ్బుర పరిచింది. తలారిసింగి పాఠశాల విద్యార్థినుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విజేతలకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. జిల్లాలోని 2896 స్వయం సహాయక సంఘాలకు రూ.130కోట్ల 40లక్షల బ్యాంకు లింకేజీ రుణాల నమునా చెక్కును కలెక్టర్ పంపిణీ చేశారు. డీసీసీబీ మొబైల్ ఏటీఎంను కలెక్టర్ సుమిత్‌కుమార్,జేసీ కార్తీక్,ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి ప్రారంభించారు.


ద్వితీయ స్థానం సాధించిన పాడేరు ఇంగ్లిష్ మీడియం ఆశ్రమ విద్యార్థినుల నృత్య ప్రదర్శన



కళాకారులను అభినందిస్తున్న, పాడేరు కేజీబీవీ విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్‌సిన్హా, ఐటీడీఏ పీవో అభిషేక్, తదితరులు

ఘనంగా క్షీరాభిషేక సేవ

దాబాగార్డెన్స్ (విశాఖ) : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వర రావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


వనుగుపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న పాడేరు అసెంబ్లీ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు : దేశంలోని ఏ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అమలు చేయలేని విధంగా ఏపీలో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అన్ని వర్గాల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్న ఘనత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి దక్కుతుందని వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరాజు అన్నారు. మండలంలోని వనుగుపల్లి పంచాయతీ కేంద్రంలో శుక్రవారం ఆయన పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలనుగిరిజనులకు వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి చేయాలని కోరారు. సర్పంచ్ మువ్వల మీన కుమారి, పాడేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సూరిబాబు, పంచాయతీరాజ్ విభాగ జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు, నేతలు నాగరాజు, కన్నాపాత్రుడు, సురేష్‌కుమార్, మహేష్, రాజారావు, సత్యనారాయణ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం


మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గంగవరం : మండలంలోని మొల్లేరు గ్రామంలో బొప్పన రాంబాబుకు చెందిన ఐదు ఎకరాల గడ్డివాము శుక్రవారం అగ్నిప్రమాదానికి గురైంది. జగ్గంపేట అగ్నిమాపక కేంద్రం సిబ్బంది తక్షణమే మొల్లేరు చేరుకొని మంటలు అదుపు చేశారు. సుమారు రూ.25 వేల నష్టం జరిగినట్టు బాధితుడు రాంబాబు తెలిపారు.

రూ.లక్ష విలువ చేసే మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎస్ఈబీ సీఐ అనిల్‌కుమార్ సిబ్బంది

అనకాపల్లి: తాళంవేసి ఉన్న ఇంటిలోంచి సుమారు రూ.లక్ష విలువచేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఈబీ సీఐ అనీల్‌కుమార్ శుక్రవారం చెప్పారు. సీఐ కథనం మేరకు వివరాలు... అందిన సమాచారం పట్టణంలో మిరియాల కాలనీలో తాళంవేసి ఉన్న ఇంటిలో పరిశీలించగా 791 క్వాటర్ బాటిళ్లు, 11 ఫుల్ బ్యాటళ్ల మద్యం, 179 బీర్ సీసాలు, ఒక ఫ్రిజ్‌ను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ చెప్పారు.

ఏటికొప్పాకలో వన్యప్రాణుల వేట

యలమంచిలి రూరల్: కోటవురట్ల, యలమంచిలి మండలాల సరిహద్దు అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల వేట జోరుగా సాగుతోంది. శుక్రవారం యలమంచిలి మండలం ఏటికొప్పాకలో స్థానిక స్మగ్లర్లు కణుజు మాంసం విక్రయించారు. కేజీ మాంసం రూ.800 నుంచి రూ.1000కు విక్రయించినట్టు స్థానికులు మీడియాకు తెలిపారు. ఇలా నెలలో రెండు, మూడు సార్లు కణుజు, అడవి పంది మాంసాన్ని విక్రయిస్తున్నారని చెబుతున్నారు. ఇక్కడ మూడు ముక్కల కొండ వద్ద కణుజును చంపి ఆ మాంసాన్ని గ్రామంలో బహిరంగంగా విక్రయించడం చర్చనీయాంశమైంది. వేట కుక్కలు, నాటు తుపాకులు, ఇతర పదునైన ఆయుధాలతో వన్యప్రాణుల వేట కొనసాగిస్తున్నారు. రాత్రి పది గంటల తర్వాత వేట మొదలు పెట్టి తెల్లారేసరికి ముగించుకుని వస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఏటికొప్పాక అటవీ ప్రాంతం నుంచి తుపాకీ శబ్దాలు వినిపించినట్టు గ్రామస్తులు తెలిపారు. దీనిపై యలమంచిలి అటవీ బీట్ ఆఫీసర్ రమణతో మాట్లాడగా, అది కణుజా? కొండ మేక అనేది నిర్ధారించాల్సి ఉందన్నారు. యలమంచిలి ఫారెస్ట్ రేంజ్ అధికారి అనిల్ కుమార్‌ను సంప్రదించగా దీనిపై వెంటనే విచారణ చేస్తామని, కణుజును వేటాడినట్టు గుర్తిస్తే, వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


కణుజును మాంసంగా చేస్తున్న వేటగాళ్లు

ఉత్తమ సేవలకు పురస్కారం

సాక్షి,పాడేరు: జిల్లాలో వివిధ శాఖల్లో ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు 331 మందికి కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్పీ తుహిన్‌సిన్హా, జేసీ కార్తీక్, ఐటీడీఏ పీవో అభిషేక్,పాడేరు సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి పాల్గొన్నారు.





కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్‌సిన్హా, నుంచి పురస్కారం అందుకుంటున్న పాడేరు ఏఎస్పీ అడ్మిన్ అనిల్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ మురళీ, పాడేరు ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, పాడేరు ఐటీడీఏ ఏపీవో ప్రభాకరరావు, విద్యుత్‌శాఖ పాడేరు ఈఈ రామకృష్ణ, ట్రైబల్ వెల్ఫేర్ పాడేరు ఈఈ డి.వి.ఆర్.రాజు, ట్రైబల్ వెల్ఫేర్ సూపరింటెండెంట్ రాము, ట్రైబల్ వెల్ఫేర్ జి.మాడుగుల ఏఈఈ దేముళ్లు, ట్రైబల్ వెల్ఫేర్‌హుకుంపేట ఏఈఈ ధృవ, ట్రైబల్ వెల్ఫేర్ అరకు ఏఈఈ అభిషేక్, ట్రైబల్ వెల్ఫేర్ రంపచోడవరం ఏఈఈ ఖాజీమభాను, ఆర్‌డబ్ల్యూఎస్ జి.మాడుగుల ఏఈఈ విజయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ అరకులోయ ఏఈఈ వినీలా, ఐసీడీఎస్ సూపరింటెండెంట్ మూర్తి, జీకేవీధి ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీదేవి, రంపచోడవరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి, అరకు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రాము, రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్ రూపకళ, పాడేరు ఏటీడబ్ల్యూవో ఎల్.రజని, పెదబయలు ఎంఈవో కృష్ణమూర్తి, హుకుంపేట కళాశాల ప్రిన్సిపాల్ సింహాచలం నాయుడు, అరకుడిగ్రీ కళాశాల లెక్చరర్ చలపతిరావు, పాడేరు హౌసింగ్ ఏఈఈ ఈశ్వరరావు, పాడేరు ఐటీడీఏ డ్రైవర్ మోహనరావు, ఐఅండ్‌పీఆర్ టెక్నికల్ సబార్డినేట్ పుష్ప, పాడేరు స్నేక్ క్యాచర్ ఉదయ్‌భాస్కర్, వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ కృష్ణారావు, రాజవొమ్మంగి డీటీ సత్యనారాయణ, ఎన్‌హెచ్ డివిజన్ అసిస్టెంట్ ఇంజనీర్ బాలాజి చక్రవర్తి, వై.రామవరం తహసీల్దార్ శ్రీనివాసరావు, కూనవరం ఎంపీడీవో ప్రేమ్‌సాగర్

కోళ్ల పరిశ్రమకు ప్రాధాన్యం ఇవ్వాలి

దేవరాపల్లి: వ్యవసాయం రంగం మాదిరిగా కోళ్ల పరిశ్రమ అభివృద్ధికి సమ ప్రాధాన్యం కల్పించి స్థాయిని పెంచాలని భారతీయ కోళ్ల పరిశ్రమ సమన్వయ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు భరణికాన రామారావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దేశ పౌల్ట్రీ పరిశ్రమ పితామహుడు, నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ(ఎల్ఈసీసీ) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టరు బీవీ రావు వర్ధంతిని పురస్కరించుకొని మండలంలోని రైవాడ పంచాయతీ బేతపూడిలో ఉచితంగా గుడ్ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా భరణికాన రామారావు మాట్లాడుతూ పెరటికే పరిమితమైన కోళ్ల పెంపకాన్ని పౌల్ట్రీ ద్వారా కోట్లలో పెంచేలా చేసిన ఘనత డాక్టరు బీవీ రావుకే దక్కిందన్నారు. ప్రతీ మనిషి ఏడాదికి సగటున 180 గుడ్లు తినాలని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందన్నారు. జాతీయ గుడ్ల సమన్వయం సంఘం ఆధ్వర్యంలో గుడ్లతో తయారైన ఆహార పదార్థాలను విక్రయించుకునేలా చిరు వ్యాపారులకు రూ.80 వేలు విలువ చేసే వాహనాన్ని యాభై శాతం రాయితీపై అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 'ఎగ్ స్టారెంట్' పేరిట రాయితీపై అందించిన వాహనాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు ప్రారంభించారు. అనంతరం గుడ్లతో వివిధ రకాల వంటకాలను గ్రామస్తులకు పెట్టారు.